
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025



సముద్రంలోకి తాబేళ్లను వదిలిన కలెక్టర్

ప్రజాశక్తి - చిల్లకూరు



చిల్లకూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామ సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను కలెక్టర్ వెంకటేష్, డిఎఫ్ఐ ఆనంద్ వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యత కాపాడేందుకు అనాదిగా వస్తున్న జాతులను కాపాడుటలో స్వచ్ఛందసంస్థలు, జిందాల్ సంస్థ సహకారంతో గుమ్మళ్లదిబ్బ సముద్రంలోకి తాబేళ్లను వదిలినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మినపట్టణం నాయకులు బక్తాని రామయ్య, మేకల వెంకయ్య, కోళంగారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మినీ గోకులాలు.. అందని బిల్లులు..!



అప్పుచేసి షెడ్డు నిర్మించా : శోభన్‌బాబు



రెండు లక్షల రూపాయలు అప్పుచేసి షెడ్డు నిర్మించాను. ఇప్పటికి ఐదు నెలలు గడస్తున్నా ఇంతవరకూ బిల్లులు జమకాలేదు. ప్రతి నెలా తెచ్చిన అప్పుకు వడ్డీ కట్టుకోవాల్సి వస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

త్వరలోనే బిల్లులు జమచేస్తాం

: ఎపిఒ భాస్కరయ్య



మండలంలో 39 పంచాయతీలకు గాను 102 మినీ గోకులాలు మంజూర య్యాయి. అందులో 51 మినీ గోకులాలు పూర్తయ్యాయి. ఇంకా 51 షెడ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీరందరికీ త్వరలోనే బిల్లులు పడతాయి. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు.

ప్రజాశక్తి - కెవిబిపురం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మినీగోకులాలను నిర్మించుకోవాలని విస్తృతంగా ప్రచారం చేసింది. అయితే మినీ గోకులాలు నిర్మించుకున్న రైతులకు బిల్లులు పడకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు.

మండలంలోని 39 పంచాయతీల్లోని రైతులు మినీ గోకులాలను (పశువుల షెడ్డులు) నిర్మించుకునేందుకు శ్రీకారం చుట్టారు. ఆరు పశువుల నివాసానికి అవసరమైన షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం 2 లక్షల 30వేల రూపాయలను మంజూరు చేసింది. ఇందులో లబ్ధిదారుల వాటా 23వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మండలంలోని రాయిపేడు, కోటమంగాపురం, ఆరేతిమ్మ సముద్రం, బ్రాహ్మణపల్లి, అంజూరు, కాళంగి, గుంటిపేడు, ఎస్ఎల్‌పురం తదితర ప్రాంతాల్లో దాదాపు 51 మినీ గోకులాలను పూర్తి చేశారు. ఇంకా 51 మినీ గోకులాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభమైన మినీ గోకులాల నిర్మాణాల పనులు ఫిబ్రవరి రెండో వారానికి పూర్తయినట్లు ఉపాధి సిబ్బంది పేర్కొన్నారు. ఒక్కో మిని గోకులం నిర్మాణానికి అంచనా వ్యయం 2.30 లక్షలు కాగా, ఇందులో లబ్దిదారుని వాటా 23వేల రూపాయలు పోను, మిగిలిన రెండు లక్షల ఏడువేల రూపాయలను లబ్దిదారునికి బిల్లుల రూపంలో జమ కావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకూ రాయిపేడు ఎస్ఎల్‌పురం గ్రామంలో నిర్మించిన మినిగోకులాల నిర్మాణాలకు సంబంధించి లబ్దిదారులు ఒక్కొక్కరికి రూ.40వేలు మాత్రమే జమ అయ్యింది. మిగిలిన లబ్దిదారులకు ఎవరికీ సింగిల్‌పైసా కూడా జమ కాలేదు. మినీ గోకులాల నిర్మాణాలు పూర్తయి దాదాపు నెలరోజులు పూర్తయినా బిల్లులు జమకాని పరిస్తితి. గోకులాల నిర్మాణాల్లో అప్పటికప్పుడు బిల్లులను సంబంధిత ఉపాధి అధికారులు అప్లోడ్‌చేస్తున్నా సొమ్ము జమ కాకపోవడంపై లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. మిని గోకులాల నిర్మాణాలు చేపట్టి వెంటనే పూర్తి చేయాలంటూ ఒత్తిడి తెచ్చిన ఉపాధి హామీ అధికారులు లబ్దిదారులకు బిల్లులు జమ య్యేలా చర్యలు తీసుకోకపోవడంపై లబ్దిదారులు మండిపడుతున్నారు. మండలంలో మినీగోకుల నిర్మాణాలు పూర్తి చేయడంలో జాప్యం జరిగిందన్న కారణంగా ఉపాధి హామీ ఏపీవోను, టెక్నికల్ అసిస్టెంట్లను ఉపాధి హామీ పీడీ సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఉపాధి అధికారులు రేయి పగలు లబ్దిదారుల వెంటపడి మినీ గోకులాల నిర్మాణాలను పూర్తి చేయించారు. అయితే సకాలంలో బిల్లులు జమ కాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బెల్టుషాపు ఉంటే... కఠిన చర్యలు

గంజాయి నిర్మూలనకు 'ఈగల్ టీంలు'
ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - క్యాంపస్

బెల్ట్ షాప్ ఉంటే... మద్యం సరఫరా చేసిన వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గంజాయి నిర్మూలనకు హోంశాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేశామని చెప్పారు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరి సమావేశ మందిరంలో ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోని కమిషనర్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్‌తో కలిసి ముందుకు వెళ్ళాల్సిన విధానంపై విస్తతంగా సమీక్ష చేస్తున్నామన్నారు. 2014-19 మధ్య ప్రజలకు ఇబ్బంది లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశామన్నారు. 2019- 24 మధ్య కాలంలో ఐదేళ్లు ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారన్నారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి..కొత్త పాలసీ పేరుతో వ్యవస్థ మొత్తాన్ని విచ్చిన్నం చేశారన్నారు. మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి, తమ సొంత బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం విధానంతో ప్రభుత్వ ఆదాయం.. ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏపీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో



లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా పెరిగింది. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగ్గా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం తీవ్రంగా కోల్పోయాం. ఆరు రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. అత్యంత పారదర్శకంగా డిప్ నిర్వహించి మద్యం షాపుల్ని కేటాయించాం. పారదర్శక లైసెన్స్ కేటాయింపు కారణంగా సుమారు 90వేల దరఖాస్తులు రాగా రూ.1800 కోట్ల ఆదాయం వచ్చింది. పాత బ్రాండ్లను తిరిగి పునరుద్ధరించాం, ప్రజలకు ఆరోగ్యం, ప్రభుత్వానికి ఆదాయం కాపాడే విధంగా పాలసీని తీసుకొచ్చామన్నారు. 350కి పైగా బ్రాండ్లు ఏపీలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. మద్యం ధరలను పొరుగు రాష్ట్రాలతో సమానంగా చేయడం వలన అక్రమ రవాణా ఆగిందన్నారు. గతంలో ఉన్న బెల్టు షాపులపైనా చర్యలు తీసుకోవడంతో దాదాపు నిర్మూలించామన్నారు. గత ఐదేళ్ల ఎక్సైజ్ శాఖను విచ్చిన్నం చేసి 'సెబ్' ఏర్పాటుతో ఎన్ఫోర్స్మెంట్ సరిగా లేకుండా పోయింది. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. మొన్నటి వరకు గంజాయి అక్రమ రవాణా కారణంగా యువత జీవితాలు చిత్తయ్యాయి. గంజాయి నిర్మూలన కోసం హోం శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. టూరిజం పెంపు కోసం 3స్టార్ హోటల్‌కు లైసెన్స్ ఫీజు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నాం. కూటమి పాలనలో అన్ని షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ అందుబాటులో ఉంచి పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మరోవైపు ఆన్ లైన్ ఇండెంట్, ట్రాక్ అండ్ ట్రేస్ విధానంతో పారదర్శకతకు శ్రీకారం చుట్టామన్నారు.



చర్చల సారాంశాన్ని రాతపూర్వకంగా ఇస్తున్న హెచ్ఆర్ డైరెక్టర్

సిఎండితో చర్చలు సఫలం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట గత 16 రోజులుగా చేస్తున్న రిలే దీక్షలను డిస్కం అధికారుల సమక్షంలో బుధవారం విరమించారు. మంగళవారం జరిగిన చర్చల్లో డిమాండ్లపై ఒప్పందం కుదిరిన నేపథ్యంలో దీక్ష విరమించినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వెల్లడించారు. చర్చల సారాంశాన్ని మినిట్స్ రూపంలో రాతపూర్వకంగా హెచ్ఆర్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, డిజిఎంలు మూర్తి, సురేంద్ర,ప్రసాద్ తదితర అధికారులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి కార్మికులకు అందించి, దీక్షల్లో ఉన్న వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. హెచ్ఆర్ డైరెక్టర్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ తామే పరిష్కరిస్తామన్నారు. తమ పరిధిలో లేని వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. వేతనాల పెరుగుదల, పి ఆర్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు విరమణ

అరియర్స్, వాచ్మెన్ ల నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా మారిన కార్మికుల జీతాల పెంపు తదితర అంశాలను హెచ్ఆర్ కమిటీలో అజెండాగా చేరుస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని అధికారులు హామీలు ఇచ్చారు. సబ్ స్టేషన్ లలో పనిచేసే కార్మికులను క్షేత్రస్థాయికి పంపడానికి వీల్లేదని రాతపూర్వక ఆదేశాలు పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నేత శివప్రసాద్ రెడ్డి, కాంట్రాక్టు కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు నారాయణ, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షులు కొండయ్య, అనంతపురం జిల్లా నాయకులు నూర్ భాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవికుమార్, పుత్తూరు కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

అన్నా మీ కాళ్లు మొక్కుతాం

వైసిపి వినూత్న నిరసన

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

భూమన అభినయ్ రూపొందించిన తిరుపతి పారిశుధ్య ప్రణాళికను కోర్టులో కేసు వేసి అడ్డుకున్న బిజెపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డికి గాంధేయ పద్ధతిలో వైసిపి నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన బయటకు వస్తున్న భానుప్రకాష్‌రెడ్డికి రోజా పూలు ఇచ్చి, కాళ్లపై పడి 'అన్నా మీ కాళ్లు మొక్కుతాం' అని నిరసన తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'తిరుపతి పారిశుధ్యాన్ని మెరుగుపరిచే విధంగా టిటిడి నుంచి అదనంగా 1700 మందిని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాంక్షన్ చేయించగా కోర్టులో కేసు వేసి బిజెపి భానుప్రకాష్‌రెడ్డి అడ్డు వస్తున్నారని' అన్నారు. ఇటీవల భక్తులకు ఏమాత్రం సంబంధం లేని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కోటి రూపాయలు శాంక్షన్ చేసిన టిటిడి బోర్డు, ఇందులో బిజెపి భానుప్రకాష్ కీలక పాత్ర పోషించారన్నారు. తిరుపతి ప్రజానీకానికి



ఉపయోగపడే పారిశుధ్యాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు ఉదయ్ వంశీ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు మద్దాలి శేఖర్ రాయల్, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షులు గీత యాదవ్ పాల్గొన్నారు

మాజీ సీఎం క్షమాపణ చెప్పాలి: భానుప్రకాష్ రెడ్డి

ప్రజలకు శాంతి భద్రతలను కల్పించడంలో విశేష పాత్ర పోషించే పోలీసులను మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి బట్టలూడదీసి కొడతామని అన్న మాటలను వెంటనే వెనక్కు తీసుకొని రాష్ట్ర పోలీసులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి సూచించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి పోలీసు విభాగం ఎలా పనిచేస్తుందో అవగాహన ఉంటుందని, అయినా ఒకరిద్దరు తప్పు చేస్తే మొత్తం పోలీసు వ్యవస్థను ఏకం చేసి దుర్భాషలాడడం మంచి పద్ధతి కాదన్నారు. జగన్మోహన్ రెడ్డికి తన శేష జీవితంలో బట్టలు ఉతుక్కోవడమే తప్ప మరేమీ చేయలేరని ప్రజలే చెబుతున్నారని భానుప్రకాష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వాషింగ్ లిక్విడ్ ప్యాకెట్లను చూపుతూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇలాంటి ప్రవర్తన వలన గత ఐదేళ్లలో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు.

డెలివరీ అయ్యేవరకూ వైద్యపరీక్షలు తప్పనిసరి

తిరుపతి : డెలివరీ అయ్యే వరకూ గర్భిణులు వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మంగళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. డెలివరీ సమయంలో చాలావరకూ హైబిపి వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, వైద్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవడం ద్వారా కాన్పు సులభతరమవుతుందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ పునీత్, నోడల్ ఆఫీసర్ టివిడి ప్రత్యూష పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టాలి : కమిషనర్

తిరుపతి టౌన్ : నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 25 వార్డులో గల కర్ణాల వీధి, అరవల్లి వీధి, వేశాలమ్మ గుడి వీధి, బలిజ వీధి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ నరసింహచారి, మునిసిపల్ ఇంజినీర్ తులసి , హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు..

పట్టణ పారిశుధ్యాన్ని మెరుగుపరచండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పట్టణంలో పారిశుధ్యాన్ని, పట్టణ సౌందర్యాన్ని కాపాడి స్వచ్ఛ సర్వేక్షన్ లో స్థానం పొందడానికి కషి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్యకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి విన్నవించారు. తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్క్ ఉత్తరం వైపుగా పాడిబడిన కార్లను తొలగించమనిగతంలో కమిషనర్ దష్టికి తీసుకెళ్లగా తిరుపతి ట్రాఫిక్ డిఎస్పికి ఆదేశాలు ఇచ్చినప్పటికీ అది అమలు కాలేదు. బుధవారం మరోసారి కమిషనర్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ పాడైపోయి



ఫిర్యాదు చేసినా స్పందించరేం..?

ఒకవైపు ఇబ్బంది పడుతుంటే, మరోవైపు పాడుబడిన కార్లు తొలగించకపోవడం వల్ల మరింత పట్టణానికి ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. వీటిని వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - రేణిగుంట

పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఏప్రిల్‌నెల నుంచి 18వేల రూపాయల వేతనం పెంచుతామని చెప్పిన ఉన్నతాధికారుల హామీని నిలబెట్టుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన చేశారు. సిపిఎం రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ, హరినాథ్, సెల్వరాజ్ మద్దతు తెలిపారు. ఈ




కార్యక్రమంలో ఎఐటియుసి మండల కార్యదర్శి కార్తీక్, మురళి, పంచాయతీ కార్మికులు సుబ్బరాజులు, చంద్రకళ, చలపతి, రమణ పాల్గొన్నారు.

క్రెడిట్ సొసైటీలో బ్రాహ్మణులకు రుణాలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణుల ఆర్థిక అవసరాలకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్నామని, 2015లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రెడిట్ సొసైటీకి ఇచ్చిన రూ.30 కోట్ల మూలధనాన్ని నేడు రూ. 300 కోట్లుగా చేశామని టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు చిత్రపు హనుమంతరావు అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జాతీయ బ్యాంకులు కూడా ఇవ్వలేని వడ్డీ రేటు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్యాంకులో ఇస్తున్నామన్నారు. పొదుపు ఖాతాపై 5 శాతం, ఫిక్స్ డ్ డిపాజిట్ పై సీనియర్ సిటిజనులకు 10 శాతం వడ్డీలు ఇస్తున్నామన్నారు. లావాదేవీలు నాణ్యతగా జరగడంతో రెండు కోట్ల రూపాయలు డివిడెంట్ వచ్చిందన్నారు. ఈ క్రెడిట్ సొసైటీలో 600 రూపాయల సభ్యత్వం తీసుకుంటే రుణాలు పొందడానికి అర్హత సాధిస్తారన్నారు. ఏటీఎం కార్డు కూడా ఐసిఐసిఐ బ్యాంకు ద్వారా జారీ చేయడానికి కార్యచరణ ప్రారంభించామన్నారు. తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న బ్రాహ్మణులందరూ ఈ ఒక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యులు సిఆర్ కే శేషగిరిరావు, భాగవతుల జయలక్ష్మి, హారిక పాల్గొన్నారు.



ఆధునిక వైద్యంతో 'ప్రాచీనాన్ని'సమ్మిళితం చేయాలి

'సాంప్రదాయ ఔషధం'పై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్

ఆధునిక వైద్యంతో ప్రాచీన ఆయుర్వేదాన్ని సమ్మిళితం చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ వృక్షశాస్త్రవిభాగం, పారంపర్య వైద్య మహాసంఘం సంయుక్తంగా 'సాంప్రదాయ ఔషధం..ఆధునిక సహజ చికిత్సల ఏకీకృత విధానం' అంశంపై మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సును ఆచార్య కామాక్షి నిర్వహించారు. వర్సిటీ సెనెట్‌హాలులో శ్రీశక్తిపీఠం పీఠాధిపతి రమ్యానంద భారతి స్వామిని, ఎస్వీ వేదిక్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమ్యానంద భారతి మాట్లాడుతూ భారతదేశంలో వృక్షజాతిలో జీవేతర అంశాలలో ఔషధం గుణాలు వెలికి తీసిన ఘనత ప్రాచీన భారతీయులదని అన్నారు. దానిని ప్రస్తుత వైద్యంలో సమ్మిళితం చేసి ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానాలు మన దేశం మరచిపోయినా పాశ్చాత్య దేశ్యాలు వాటిని ఆచరిస్తున్నాయన్నారు. ఎన్ఆర్ఐ డాక్టర్ కామేహ్వరరావు బద్రీనాథ్ మాట్లాడుతూ ఆధునిక వైద్యం, ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానాన్ని అనుసంధానం చేయాలన్నారు. టిటిడి అటవీ



శాఖ అధికారి సెల్వం మాట్లాడుతూ దాదాపు 2వేల ఏళ్ల కిందట ఉన్న ఆయుర్వేద సంబంధిత గ్రంథాలు ప్రస్తుతం అందుబాటులో లేవని, కానీ అడవుల్లో జీవిస్తున్న గిరిజన తెగలకు వైద్యం గురించి ఇంకా అవగాహన ఉందన్నారు. అడవిలోని ప్రతి మొక్కా ఆయుర్వేదానికి ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర స్టేట్ మెడికల్ బోర్డు అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ కృత, త్రేతా, ద్వాపర యుగంలో మనుష్యులు ఆరోగ్యంగా ఉండేవారని, కలియుగంలో మనిషికి ఆరోగ్యం, ఆయుష్షు రెండూ తగ్గాయన్నారు. తితిదే ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రేణుదీక్షిత్, ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, ఆచార్య కామాక్షి, ఆచార్య నాగలక్ష్మి దేవమ్మ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు త్యాగాలను నేటి యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని, అప్పుడే కమ్యూనిస్టు పార్టీ సజీవంగా ముందుకు పోవడానికి మార్గం సుగమమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు స్పష్టం చేశారు. 31 వ వర్ధంతి సందర్భంగా తిరుపతి నగరం బైరాగి పట్టెడులోని సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాద శక్తుల ఆగడాలను అడ్డుకోవాలంటే జనసేవాదళ్ తప్పనిసరి అవసరమని గుర్తించి, జనసేవ దళ్ ఏర్పాటు చేసి కర్ర పట్టుకుని దళిత గిరిజన బడుగు బలహీన మైనారిటీలపై జరిగే దాడుల్లో స్వయంగా పాల్గొని మతోన్మాద శక్తుల గుండెల్లో గుబులు పుట్టించిన మహా నేత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నం పెంచలయ్య, కె.రాధాక్రిష్ణ, జల్లా విశ్వనాథ్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో వీగిపోయిన అవిశ్వాసం

ప్రజాశక్తి- వెంకటగిరి



విజయ సంకేతంతో వైసిపి కార్పొరేటర్లు, నాయకులు

వెంకటగిరి పురపాలక చైర్ పర్సన్ నక్క భానుప్రియ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఉత్కంఠ పరిణామాల మధ్య బుధవారం వీగిపోయింది. మొత్తం 25 మంది కౌన్సిలర్లుకు గాను 19 మంది వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు అవిశ్వాసానికి వ్యతిరేకంగా నిలవడంతో ఆ తీర్మానం వీగిపోయినట్లు గూడూరు సబ్ కలెక్టర్ , అవిశ్వాస తీర్మానం ప్రొసిడింగ్ అధికారి రాఘవేంద్ర మీనా ప్రకటించారు.

మున్సిపాలిటీలో ఉన్న 25 వార్డుల్లో కౌన్సిలర్‌లు వైఎస్ఆర్సిపి తరుపున గెలపొందారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ముగ్గురు కౌన్సిలర్లు టిడిపి లో చేరారు. గత నెల 18వ తేదీన వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ కొలువుదీరి నక్క భానుప్రియ పై 19వ తేదీన 16 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని ప్రతిపాదించారు. ఎన్నికల కమిషన్ గురువారం అవిశ్వాస తీర్మానం నిర్వహించగా వైఎస్ఆర్సిపి తరఫున 19 మంది కౌన్సిలర్లు నిలిచి అవిశ్వాస తీర్మానంకు వ్యతిరేకంగా ఓటు వేశారు. 6 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో అవిశ్వాస తీర్మానం విరిగిపోయినట్లు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ప్రకటించారు. వెంకటగిరి మున్సిపాలిటీలో ఎలాగైనా వైసిపి పట్టు నిలపాలని పావులు కలిపిన నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తన పంతం లెక్కించుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. నిజం, నిబద్ధత వల్లే అవిశ్వాసం వీగిందని అన్నారు. కూటమి పతనం ప్రారంభమయ్యిందన్నారు. తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎంఎల్‌సి మేరుగ మురళీధర్ మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంతో చారిత్రిక విజయాన్ని సొంతం చేసుకోగలిగామని తెలిపారు.

సభలు సరే...పరిష్కారమెప్పుడు?

సర్వసభ్య సమావేశంలో నిలదీత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

క్రమం తప్పకుండా సమావేశాలు పెట్టడం.. సమస్యలు తెలుసుకోవడం మినహా పరిష్కారం చూపడం లేదని మండల సర్వసభ్య సమావేశం సాక్షిగా అధికారులను సభ్యులు నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోతున్నాయని సభ్యులు ధ్వజమెత్తారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నిర్మలమ్మ అధ్యక్షతన ఎంపీడీవో సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగుకో గుంత గజానికో గొయ్యిలా తయారైన గ్రామీణ రహదారులకు ఎప్పుడు మరమ్మతులు చేస్తారంటూ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి ఆర్అండ్ బీ ఇన్చార్జి ఏఈ దుర్గేష్ ను ప్రశ్నించారు. మినీ గోకులాలు ఎవరి ఆమోదంతో పాడిరైతులకు అందించారని..? పశువులు లేనివారికి సైతం గోకులం షెడ్డులు మంజూరు చేశారంటూ కొణతనేరి సర్పంచి బాలాజీ ఉపాధిహామీ అధికారుల తీరుపై మండిపడ్డారు. చియ్యవరంలో సంఘమిత్రలు పక్కదారి పట్టించిన డ్వాక్రా సభ్యురాళ్ల సొమ్మును ఎప్పుడు తిరిగి వసూలు చేస్తారంటూ వెలుగు ఏపీఎం ఇందిరా గాంధీని పలువురు సభ్యులు నిలదీశారు. పౌర సరఫరాలు, జలవనరులు, పలుశాఖల అధికారుల తీరు మీద అసంతప్తి వ్యక్తం చేశారు. అభివద్ధి నివేదికలను శాఖల వారీగా సమావేశంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అర్చనాదేవి, వైస్ ఎంపీపీలు గెరటారెడ్డి, మల్లికమ్మ, తహశీల్దార్ మధుసూదన్ రావు పాల్గొన్నారు.



బ్యాలెన్సూ... మా బాధ్యతే..!

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రెక్కడితే గాని డొక్కాడని బతుకులు వారివి.... మండే ఎండను సైతం లెక్కచేయక తమ బాధ్యతను పూర్తిచేసి ఆ వచ్చే కూలి డబ్బులతో వారి కుటుంబాలను పోషించుకునే పరిస్థితులు. ఎంతటి బరువైన అందరూ కలిసి ఎంతో బాధ్యతతో వస్తువు చెక్కుచెదరకుండా నేలకు దింపగల నేర్పరులు వారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో మండుటెండలో సుదూర ప్రాంతం నుండి బరువైన ఆ వస్తువును తీసుకొని వస్తుండగా ఆ వస్తువుల బరువుకు బండి ఎడమవైపుకు ఒంగిపో సాగింది. ఆ బరువును ఎంతో బాధ్యతగా ఐదు మంది కూలీలు కుడి వైపుగా నిలబడి వాహనాన్ని సమాంతరంగా నిలిచేలా చేశారు. ఇలా కొన్ని కిలోమీటర్లు మండుటెండలో కూలీలు నిలుచునే వచ్చారు. ఈ చిత్రాన్ని 'ప్రజాశక్తి' మంగళం రవాణా శాఖ కూడలిలో తీసింది.



వాహనం పక్కకు ఒరిగిపోకుండా బ్యాలెన్స్ చేస్తున్న కార్మికులు

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండల పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. గర్భిణులు ధనుర్వాతము రాకుండా టీకా వేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారం తీసుకుని అదనంగా ఇంటి వద్ద పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, గుడ్డు, పాలు సమృద్ధిగా తీసుకుని హాస్పిటల్లోనే ప్రసవం జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలు అన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విద్యాసాగర్, వైద్యాధికారిణి మాధవి, ఆరోగ్యాధికారి డివిన్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం: ఎమ్మెల్యే


ప్రజలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలో అన్న క్యాంటీన్ ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఐదు రూపాయలకే పోషక ఆహారం ఇవ్వాలనే ఉద్దేశంతో అన్న క్యాంటీన్ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం టిడిపి ప్రభుత్వం హామీలను నెరవేరుస్తుందని చేనేత కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నాయన్నారు. అతి తక్కువ సమయంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8 వేల కోట్లు పెట్టుబడి పెట్టడానికి పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని, ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్ చొరవతోనే సాధ్యమని గుర్తు చేశారు.

సెలవు దినాల్లోనూ కాలేజీలకు వెళ్లాలి: ఎంఈఓ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థిని విద్యార్థులు ఈ సెలవు దినాలను వృథా చేయకుండా కళాశాలలకు వెళ్లేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని బుచ్చినాయుడు కండ్రిగ ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఒక మంచి సువర్ణ అవకాశం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని పరీక్ష ఫలితాలతో సంబంధం లేకుండా పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థుల విద్యపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఇంటర్, కాలేజీల్లో 20 రోజుల పాటు ముందస్తు క్లాసులు నిర్వహిస్తున్నారని ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇష్టమైన సబ్జెక్టులో చేరవచ్చన్నారు. తల్లిదండ్రులు స్పందించి తమ పిల్లలను కళాశాలలకు పంపాలని సూచించారు.

దళితులపై కేసులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు దళితులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా పోలీసులు ఉద్యమం చేస్తున్నారని ఆరోపించారు. గ్రీవెన్స్‌డే రోజు వంటావార్పు, కలెక్టరేట్ కార్యాలయానికి దళితులతో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. లేకపోతే దీక్షలు చేపట్టి నెల రోజులు గడుస్తున్నా స్పందించకపోవడం అన్యాయమన్నారు. కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 252, 253, 254552 ప్రభుత్వ భూమిని ఇవ్వాలన్నారు. స్థానికులైన బత్తెయ్యనాయుడు 1.75 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. బత్తెయ్యనాయుడు భూ ఆక్రమణను అడ్డుకున్న 10 మంది దళితులపై అక్రమ కేసులు పెట్టడం భూకబ్జాదారులకు అధికారులు సహకరించడమే అన్నారు. వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కత్తి ధర్మయ్య, దళితులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేలా టిడిపి ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తంగా బుధవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ సర్కిల్, [illegible] కార్యాలయం, శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్, అమర జ్యోతి కళ్యాణ మండపాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని దృష్టిలో పెట్టుకుని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చలివేంద్రాలను ఏర్పాటు చేశారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణాధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా దూరవిద్య పరీక్షలు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో దూరవిద్య విభాగం ఆధ్వర్యంలో దాదాపు 32 వేల మంది విద్యార్థులు ఏప్రిల్ 2వ తేదీ నుండి పరీక్షలకు హాజరవుతున్నారని, బుధవారం 9వ తేదీ వరకు ప్రశాంతంగా పరీక్షలు జరుగుతున్నాయని దూరవిద్య విభాగం డైరెక్టర్ ఆచార్య పూజా రమేష్ బాబు బుధవారం తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ కి చెందిన కొన్ని ప్రత్యేక పరీక్షలు మరో వారంలో ముగియనున్నాయని తెలిపారు. ఇప్పటివరకు పరీక్షలు అన్నీ ప్రభుత్వ కళాశాలలో పోలీసు శాఖ సహకారంతో చాలా పకడ్బందీగా, పారదర్శకంగా, సమన్వయం, సమస్యలు లేకుండా సాగుతున్నాయన్నారు. సమస్యాత్మక కళాశాలల వద్ద ప్రత్యేక పరీక్ష బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణకు సహకరిస్తున్న ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ముబ్బు నారాయణరెడ్డి జన్మదినం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: టిడిపి సీనియర్ నాయకులు ముబ్బు దేవనారాయణ రెడ్డి జన్మదినాన్ని తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్, నాలుగుకాళ్ల మండపం, రుయా, స్విమ్స్ ఆస్పత్రుల వద్ద అన్నదానం చేశారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు, టిడిపి నగర పార్టీ అధ్యక్షులు శ్రీధర్ వర్మ, పులిగోరు మురళీకృష్ణ రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

టిడిపి ప్రజా దర్బార్‌కు 43 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం ప్రజాదర్బార్ తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మన్నూరు సుగుణమ్మ నివాసంలో నిర్వహించారు. మొత్తం 43 సమస్యలు అందాయి. మున్సిపల్ విభాగానికి సంబంధించి 35 ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా వేదిక సమస్యలపై జెసి తనిఖీ


అర్జీలను తనిఖీ చేస్తున్న జెసి శుభం బన్సల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుల అర్జీలపె, పరిష్కారం కాని అర్జీలపై జెసి శుభం బన్సల్ బుధవారం తనిఖీ చేశారు. ఏడు గంటల సమయంలో పుత్తూరు రెవెన్యూ గ్రామ లెక్క దాఖలలో సర్వే నెంబరు34/1ఎ లో 2.24 సెంట్లు పట్టాభూమి 22 ఏ జాబితాలో నమోదు అయి వుందని సదరు విషయమై పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులో అర్జీని సమర్పించిన ఎన్ మునిరత్నం తండ్రి ఎన్ మణి వారి అర్జీ పరిష్కారం లో భాగంగా ఆ అర్జిదారులను ఆకస్మిక తనిఖీసి భూమిని పరిశీలించారు. ఈ తనిఖీలలో తహశీల్దారు జి సి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దారు ఎం అశోక రెడ్డి, మండల సర్వేయరు బి శేషమ రాజు, ఇన్‌ఛార్జి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి గురుస్వామి, గ్రామ రెవెన్యూ అధికారి టి అరుణ పాల్గొన్నారు.

రాస్, ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టులో దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాస్-ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టులో అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాస్ జనరల్ సెక్రటరీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండి ఆ ప్రాంత స్థానికత తెలుపుతూ ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఈనెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టుల ప్రాంతాలు వేషాలమ్మ గుడి వీధి, మంగళం సప్తగిరి కాలనీ, అంగన్వాడి సహాయకురాలు ఎన్టీఆర్ కాలనీ, ఎస్టివి నగర్-1, మల్లయ్య గుంటకట్ట, సత్యనారాయణపురం, కొర్లగుంట-4, ప్రగతి నగర్ లో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. గడువు లోపు అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని రాస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

శాశ్వత విసి నియామకాలలో
బీసీ ఆచార్యులకు అవకాశం కల్పించండి


రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 విశ్వ విద్యాలయాలలోని ఖాళీగా ఉన్న ఆరు విశ్వవిద్యాలయాలలో శాశ్వత ఉపకులపతి నియామకాలలో వెనుక బడిన తరగతులైన బిసి సీనియర్ ఆచార్యులకు అవకాశం కల్పించాలని మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తికి ఎపి బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం మొదటి నుండి బీసీలకు పెద్దపీట వేస్తోందని యూనివర్సిటీ విసిల నియామకాల్లో సీనియర్ బీసీ ఆచార్యులకు అవకాశం కల్పించాలని కోరారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విసిగా సీనియర్ బిసి ప్రొఫెసర్లను నియమించాలని ఛైర్మన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, సాయి , నక్క గోపీచంద్, డాక్టర్ సునీల్, రవీంద్ర, దుర్గారావు, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టిక ఆహార పక్షోత్సవాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఐసిడిఎస్ ప్రాజెక్టు పుత్తూరు పరిధిలోని పుత్తూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి హెచ్ సి) లో ఈ రోజు పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వెయ్యి రోజుల సంరక్షణపై గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి, హెడ్ నర్స్ దిల్షాన్, డెంటల్ డాక్టర్ పల్లవి, ఐసిడిఎస్ సూపరువైజర్లు సంధ్య, గీతాంజలి, అనిత అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ స్టాఫ్ పాల్గొన్నారు.

గ్రామకంఠం భూములు కాపాడండి
- మల్లంపల్లి గ్రామస్థుల వినతి


జనసేన ఇన్‌ఛార్జి వినుత కోటాకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -ఏర్పేడు, శ్రీకాళహస్తి : అముదూరు పంచాయతీలోని మల్లంపల్లిలో సర్వే నంబర్ 300/10 లో 1.92 ఎకరాలు ప్రభుత్వ గ్రామకంఠం భూములను అదే గ్రామానికి సంబంధించిన కొందరు కబ్జా చేసి పట్టాలు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆ భూమిని కాపాడాలని గ్రామస్థులు వినుత కోటాకు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జనసేన కార్యాలయంలో కలిసి ఆమెను వినతి ఇచ్చారు. ఈ ప్రభుత్వ గ్రామకంఠం భూమిలో గ్రామస్థులు కోసం ప్రజల కోసం ప్రభుత్వ ఆసుపత్రి, పిల్లలకి ప్లే గ్రౌండ్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని అనుకుంటున్నామని తెలిపారు. అయితే కొందరు అలా కాకుండా కొంత మంది కబ్జా చెయ్యాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లినా ఈ సమస్యను పట్టించుకోలేదని తెలిపారు. ఈ సమస్యను వినుత కోటా వెంటనే శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్ రెడ్డికి తెలిపి మల్లంపల్లి గ్రామస్తు లు భూముల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్‌డిఓ తక్షణమే చర్యలు తీసుకుని కబ్జాలను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు.

తహశీల్దారుని కలిసిన నాయకులు


తహశీల్దారు శ్రీదేవిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం తహశీల్దారు బాధ్యత చేపట్టిన శ్రీదేవిని శాలువాలతో సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ మనోహర్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు విభాగం కార్యదర్శి రమణయ్య యాదవ్, తిరుపతి పార్లమెంట్ టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు సత్యనారాయణ, యూనిట్ ఫోర్ ఇన్‌ఛార్జి, మునేయ్య, మోహన్ యాదవ్, పార్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆదిశేషయ్య, మండల ఐటిడిపి రమేష్, పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి..

రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు శ్రీదేవిని టిడిపి నాయకులు కార్తీక్ నాయుడు, మునిచంద్ర నాయుడు, రవి నాయుడు, మధు నాయుడు కోరారు. మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, రేషన్ షాపుల మార్పుల విషయం గురించి, కొత్తగా మంజూరు అవుతున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్స్ గురించి ఇంకా మండలంలో ఉన్న ఇతర సమస్యలపై చర్చించారు. స్పందించిన తహశీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో బాధ్యతగా మెలగాలి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవిస్తూ క్రమశిక్షణతో బాధ్యతగా మెలగాలని, విద్యార్థుల జీవితంలో కళాశాల జీవితం ప్రత్యేకమైన రోజు అని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలోకళాశాల జీవితం ప్రత్యేకమైన రోజని తెలిపారు. తల్లిదండ్రులను గౌరవించడంతో పాటు, క్రమశిక్షణతో బాధ్యతగా మెలగాలని తెలిపారు. రాబోయే డిగ్రీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. స్నేహం నిస్వార్థమైందని, మంచి స్నేహి తులను కలిగి ఉండడం అదృష్టమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. ఎమ్మెల్యే సహకారంతో కళాశాల పురోభివృద్ధికి కృషి చేస్తామని, ఈ విద్యా సంవత్సరంలో కళాశాల సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణాన్ని రంగురంగుల పూలు, బెలూన్లతో అలంకరించారు. విద్యార్థినివిద్యార్థులు ఆధునిక, సంప్రదాయ వస్త్రాలతో కనువిందు చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య, స్టూడెంట్ వైస్ ప్రెసిడెంట్ వి వీరయ్య, డాక్టర్ పి సుజనా, టి నరసింహులు, డాక్టర్ వెంకటకృష్ణయ్య, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఆర్‌బి వాణిశ్రీ, డాక్టర్ ఏ దేవకి అధ్యాపకులు, స్థానిక పుర ప్రముఖులు గంజి మాధవయ్య, జీవరత్నం నాయుడు, నారాయణ బాబు, ఎస్ఐ సురేంద్ర నాయుడు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్ హరి ప్రసాద్ దాతృత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ షరీనా, డాక్టర్ ఎన్ హరి ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ షరీనా మాట్లాడుతూ జెవివి 11 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దాత డాక్టర్ హరిప్రసాద్, జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్ , చెంచు నారాయణ , పురుషోత్తమ రావు, రామ మోహన్ , ప్రభాకర్, ఇబ్రహీం, సుబ్బారావు , ఆనంద్ , శ్రీనివాసాచారి, రజినీ, నిమ్మకాయల రవి, అరుణ్, సాయి పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత ఆలోచనలు పెంపొందించాలి
అమర్ రాజా వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు



ప్రజాశక్తి - క్యాంపస్ : చిన్ననాటి నుండే చిన్నపిల్లల్లో సృజనాత్మకత ఆలోచనలు పెంపొందించాలని ఉపాధ్యాయులకు అమర రాజా వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలో రుచిత కలర్‌ఫుల్ కాన్వాస్ పెయింటింగ్ వర్క్‌షాప్‌లు, రుచితచే కలర్‌ఫుల్ కాన్వాస్ ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో కళారంగం గత ఏడాది కాలంగా ప్రశాంతంగా వికసించింది. ఒక అభిరుచి ప్రాజెక్ట్‌గా ప్రారంభించామన్నారు. ఒక ప్రియమైన నెలవారీ ఈవెంట్‌గా మారిందని, కాన్వాస్ పెయింటింగ్ ఆర్ట్ వర్క్‌షాప్‌ల ద్వారా వారి సృజనాత్మక వైపు అన్వేషించడానికి అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించిందన్నారు. కళాకారుడు, చొరవ వెనుక స్థాపకురాలు రుచిత, కళను మరింత చేరువయ్యేలా, ఆనందించేలా స్వస్థత చేకూర్చేందుకు ఒక సాధారణ ఆలోచనతో ఈ సెలక్షన్‌లను ప్రారంభించారు. రుచిత ద్వారా కలర్‌ఫుల్ కాన్వాస్ తిరుపతి అంతటా రంగులు పంచి విజయవంతమైన సంవత్సరాన్ని పూర్తి చేస్తున్నందున, పెద్ద గ్రూప్ సెషన్‌లు, పుట్టినరోజు పార్టీలు, నేపథ్య వర్క్‌షాప్‌లు, మరిన్ని స్థానిక వేదికలతో సహకారం కోసం ఇప్పటికే ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్ ల్యాండ్ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న మదర్‌ల్యాండ్ నర్సింగ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండు చేశాయి. తిరుపతి ఆటోనగర్ సమీపంలో ఉన్న మదర్ ల్యాండ్ నర్సింగ్ కాలేజీలో ఒకపక్క నిర్మాణం జరుగుతోందని, మరోపక్క విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఆ నిర్మాణం జరుగుతున్న సమయంలో విద్యార్థులకి ఎలాంటి హాని జరిగినా అక్కడ పట్టించుకోని పరిస్థితి వుందన్నారు. గతంలో ఇలాంటి సంఘటనలే చోటుచేసుకున్నాయని తెలిపారు. అక్కడ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల నుండి అధిక ఫీజు వసూలు చేయడమే కాకుండా ఇంకా ఫీజులు కట్టాలని విద్యార్థినులను వేధిస్తూ వాళ్ళకి హాల్ టికెట్లు ఇవ్వకుండా పరీక్షలు రాయినివ్వమని భయపెడుతున్నారన్నారు. అర్హతలేని ఉపాధ్యాయులచే విద్యను బోధిస్తున్నారని, సరైన ల్యాబ్ పరికరాలు లేకుండా క్లాస్ నిర్వహిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం ఎస్‌వి యూనివర్సిటీ అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి హెచ్ లోకేష్, నాయకులు యువరాజ , యుగంధర్ పాల్గొన్నారు.

ఘనంగా అట్లాంటీస్ స్కూల్ వార్షికోత్సవం


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులుల

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని అట్లాంటిస్ పాఠశాల 4 వ వార్షికోత్సవం మహతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్అథారిటీ అధ్యక్షులు అనిమిని రవి నాయుడు, తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, చిన్నారి పట్ట భద్రులకు పట్టాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ ఇలాంటి పాఠశాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక విద్యను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ అని తెలిపారు. క్రీడల్లో ముఖ్యమైన పాత్ర వహిస్తున్న విద్యా సంస్థగా అట్లాంటిస్ పాఠశాలను కొనియాడారు. గురుమూర్తి మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడంలో అట్లాంటిస్ పాఠశాల యాజమాన్యం ముందుంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలో శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ యాజమాన్యం నాలుగు దశాబ్దాలుగా యువతను ప్రోత్సహిస్తోందన్నారు. చిన్నారుల డాన్సులు విశేషంగా ఆకర్షించాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రతిఅంశం ఒక ప్రత్యేకతను చాటుకుంది. తండ్రికి పిల్లల పట్ల ఉన్న బాధ్యతను వారిలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంచాలి? అనే విషయంపై మరాఠీ మహారాజ చత్రపతి శివాజీ శంభాజీ కీ బోధిస్తున్నట్టుగా, పిల్లల పట్ల అమ్మ చూపే ఆప్యాయత, అనురాగాన్ని చక్కగా చూపించారు. ప్రధానంగా పంచభూతాలు మానవుని జీవన మనుగడకు ఎలా ఉపయోగపడతాయి? వాటి గొప్పతనాన్ని గురించి చాలా అత్యద్భుతమైన ప్రదర్శన చేశారు . విద్యార్థుల మానసిక వికాసానికి తగినట్టుగా ఆటలు కూడా ఉండాలన్న నేపథ్యంతో ఖేలో భారత్' అనే శీర్షికన నేటి యువత క్రీడల్లో రాణించాలని ప్రోత్సహిస్తూ ఒక నృత్యాన్ని చేశారు. రామాయణం . మహాభారతాల నృత్యరూపకాలను ప్రదర్శించి మెప్పించారు. ముఖ్యంగా సంపూర్ణ రామాయణాన్ని బాల రామాయణం గా అత్యద్భుతంగా ప్రదర్శించడమే కాక మహాభారతంలోని ప్రధాన ఘట్టమైన కురుక్షేత్ర యుద్ధాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. గత సంవత్సరం సీబీఎస్సీ, పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత కేఎస్ వాసు మాట్లాడుతూ విద్యార్థులలో సాంస్కృతిక అంశాల పట్ల ఆసక్తిని కనబరిచేలా ప్రోత్సహించడం మా పాఠశాల ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రమీల కృష్ణన్. వైస్ ప్రిన్సిపల్ మోహకర్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నువ్వుల పంటలో క్షేత్ర దినోత్సవం


నువ్వుల పంటలో క్షేత్ర దినోత్సవం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - కెవిబిపురం : కేవిబి పురం మండలంలోని రాయపాడు గ్రామంలో బుధవారం రాస్ కేవికే, కరకంబాడి వారు జాతీయ ఆహార భద్రతా మిషన్ సహకారంతో నూనె గింజల.. పంట నువ్వులలో సామూహిక నువ్వుల ప్రదర్శనా క్షేత్రాలలో క్షేత్ర దినోత్సవం నిర్వహించినట్లు డాక్టరు దివ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, కెవికె శాస్త్రవేత్తలు దివ్య, రాము కుమార్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద రైతు బాగుండాలని లక్ష్యంతో ఉచితంగా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేసున్నారని ఇలాంటి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాస్ కెవికె వారు గత డిసెంబరు మాసంలో ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం నువ్వులలో శారద రకపు విత్తనం, కలుపు పురుగు మందులను పంపిణీ చేశారు. పంట దశలో ఆశించే వివిధ పురుగు తెగుళ్ల నివారణకు రసాయన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాస్ కెవికె శాస్త్రవేత్తలు గ్రామంలోని ప్రదర్శనా క్షేత్రాలలో పంటకోత ప్రయోగం చేపట్టి నువ్వులలో హెక్టారుకు 12 నుండి 18 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవికె హెడ్ డాక్టరు ఎస్ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి సంజీవ రెడ్డి, కేవికె శాస్త్రవేత్తలు డాక్టరు వి దివ్య, రాము కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చి నాయుడు కండ్రిగ మండలం కారని గ్రామానికి చెందిన విజయ్ తన మిత్రుడు వరదరాజులతో కలిసి ద్విచక్ర వాహనంపై తడ వైపు వెళుతుండగా రాచకండ్రిగ సమీపంలో ఆగివున్న వాహనాన్ని ఢీ కొంది. దీంతో విజయ్ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. వరదరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని హుటాహుటిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం గంగుడుపల్లి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది వుండడాన్ని కనుగొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


బైండ్ ఓవర్ కేసులను పరిశీలిస్తున్న తహశీల్దారు

ముగ్గురిపై బైండ్ ఓవర్ కేసులు

ప్రజాశక్తి -రామచంద్రపురం: రామచంద్రపురం మండలంలోని అనుపల్లి పంచాయతీకి చెందిన రేఖల చేను, ఉప్పలి వంక గ్రామాలలోని ఇరు గ్రూపులకు చెందిన ముగ్గురిపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసినట్లు ట్రైనీ ఐపీఎస్ బొడ్డు హేమంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇటీవల జరుగుతున్న చిన్నచిన్న సంఘటనల దృష్ట్యా భవిష్యత్తులో ఇటువంటి చిన్న చిన్న సంఘటనలే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా సమస్యాత్మకమైన వ్యక్తులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సత్ప్రవర్తనతో నడుచుకొని భవిష్యత్తులో ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టించకుండా ప్రశాంత మైన జీవితాన్ని గడపాలని బైండోవర్ నిమిత్తం మండల మేజిస్ట్రేట్ రామచంద్రపురం వారి ఎదుట గతంలో నలుగురిని హాజరపరిచినట్లు తెలిపారు. బుధవారం మండల మెజిస్ట్రేట్ రామచంద్రపురం వారి ఎదుట ముగ్గురిని బైండోవర్ చేశారు. మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని సమాచారం ఇచ్చినా లేదా చట్టాన్ని అతిక్రమించినా వారిని కచ్చితంగా బైండోవర్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు అమృత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్సై రవీంద్ర నాయక్ లు పాల్గొన్నారు.

ఫారెస్ట్ ఆఫీసర్‌కు మూడు నెలలు జైలు
ఐదువేల రూపాయల జరిమానా

ప్రజాశక్తి -దొరవారిసత్రం : నేలపట్టు ఫారెస్ట్ పక్షుల కేంద్రంలో మహిళా ఫారెస్ట్ అధికారిణిని వేధించిన కేసులో బుధవారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బొడ్డు వరప్రసాద్ రావుకు సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ అనిల్ కుమార్ 3 నెలలు జైలు శిక్ష, ఐదువేల రూపాయలు జరిమానా విధించారని దొరవారిసత్రం ఎస్ఐ అజయ్ కుమార్ బుధవారం తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2023 సంవత్సరం దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్.కె అస్మతున్నిసా పైన అసభ్యకరంగా అప్పటి ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బొడ్డు వరప్రసాదరావు అసభ్యకరంగా ప్రవర్తించడంతో, దొరవారిసత్రం పోలీస్ స్టేషన్ లో ఆమె రిపోర్ట్ ఇచ్చారు. దొరవారిసత్రం పోలీసు కేసు రిజిష్టర్ చేసి, ఇన్వెస్టిగేషన్ పూర్తి అయిన తర్వాత చార్జిషీట్ ను కోర్టులో దాఖలు చేశారు. కేసు విచారణ పూర్తయిన తర్వాత సూళ్లూరుపేట కోర్టు జడ్జిఎస్ అనిల్ కుమార్ నిందితుడు బొడ్డు వరప్రసాదరావుకు 3 నెలలు జైలు శిక్ష, ఐదువేల రూపాయలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ వాదించారు.

'మా ఇంటిని కబ్జా చేయాలని చూస్తున్నారు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తన ఇంటిని కబ్జా చేయాలని చూస్తున్నారని తిరుపతి రూరల్ మల్లంగుంట పంచాయతీ అంబేద్కర్ కాలనీకి చెందిన సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1984లో ప్రభుత్వం ద్వారా మంజూరు అయిన ఇంటికి ప్రతి ఏటా పన్నులు చెల్లిస్తున్నానని, అయితే ఈవోపిఆర్ డి మాలతి ప్రస్తుతం పాకాలలో పనిచేస్తూ, 2008లోనే తన ఇంటిని కొన్నానని రాయబారాలు పంపిస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చెప్పినా న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం ఈవోపిఆర్‌డి మాధురి డాక్యుమెంట్లు పరిశీలించడానికి అని చెప్పి తమ డాక్యుమెంట్లు పాకాల ఈవోపిఆర్‌డి మాలతికి అందించిందని ఆరోపించారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మల్లంగుంట సర్పంచి రామచంద్రయ్య మద్దతుదారుడు ప్రేమ్‌కుమార్ రాత్రి సమయంలో తన స్థలంలో దౌర్జన్యంగా నిర్మాణాలు చేయడానికి పూనుకోగా పోలీసుల సాయంతో అడ్డుకట్ట వేశానన్నారు. ప్రేమ్‌కుమార్ వల్ల తన కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. ఎంఎల్‌ఎ నానికి చెప్పినా, అధికారులు పట్టించు కోకుండా 2021 నుంచి పన్నులు కట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో భర్త మురళి, టిడిపి ఎస్సీ మహిళా ప్రగతి సేవాసంఘం నాయకురాలు రేవతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను యూపీ ప్రజా ప్రతినిధుల బృందం, జిల్లా రైతు సాధికార సంస్థ అధికారులు ప్రకృతి వ్యవసాయ పంటల సాగును పరిశీలించారు. తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో అనంతపురం, సత్య సాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన 46 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుధవారం రామచంద్రపురం మండలం కుప్పంబాదురు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ కార్యకర్త సుబ్రహ్మణ్యం రెడ్డి వరిలో ఏ గ్రేడ్ మోడల్, ఎన్ఎఫ్ లో వరి పంట విధానం, వరిలో రసాయనక పంట విధానాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రణాళికలు తయారు చేశారు. పంట పెరుగుదల, దృఢత్వం, తెగుళ్ళ, వేరు వ్యవస్థ విధానాలపై 46 మంది సభ్యులు మూడు భాగాలుగా విడిపోయి పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయ, రసాయనిక వ్యవసాయ మధ్య వ్యత్యాసాలను పరిశీలించారు. ఈ క్రమంలోనే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని జాగృతి సేవా సంస్థ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, మేనేజర్ విజయ్ అమ్మన్ నవర్ రెండు రోజులుగా తిరుపతి రూరల్ మండలం, రామచంద్రాపురం మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖి చర్చించి పద్ధతులు, విధి విధానాలు తెలుసుకున్నారు. కుప్పం బాదురు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను వారిద్వారా మహిళలకు అందించారు. ఉత్తర ప్రదేశ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విధివిధానాలను తమ రాష్ట్రంలో కూడా అవలంబించేలా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టీం లీడర్ ఉమయాన్, అడిషనల్ డిపిఎం పట్టాభిరెడ్డి, డి పి పి దివ్య, మండల టీం లీడర్ విమల, టీం లీడర్లు నేలమ్మ, నాంచారమ్మ,ఎం.టి రంగయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా వీడియో తీసిన వ్యక్తిపై దాడి

- బాధితుడి పరిస్థితి విషయం - ప్రత్యేక చికిత్సకోసం తిరుపతి రుయాకు తరలింపు

ప్రజాశక్తి - సత్యవేడు: శ్రీ సిటీ పరిధిలోని అప్పయ్య పాలెంలో ఆంధ్ర నుండి తమిళనాడుకు ఇసుక తరలిస్తుండగా ఇసుక మాఫియా ఆగడాలను వీడియో తీసినందుకు వెంకటేశ్వర్లు నాయుడు పై ఇసుక మాఫియా గ్యాంగ్ మారణ ఆయుధాలతో దాడి చేసిన మండలంలో గబుధవారం చోటుచేసుకుంది. సంఘటన చోటుచేసుకుంది. బాధితుడు బంధువుల కథనం మేరకు... సత్యవేడు మండలం శ్రీ సిటీ పరిధిలోని ఈస్ట్ మల్ల వారి పాలెం పంచాయతీకి చెందిన అప్పయ్య పాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నాయుడు అదే గ్రామంలోని తమిళనాడు సరిహద్దులో శేఖర్ నాయుడు అనే వ్యక్తి నూతన గృహ నిర్మాణానికి ఆంధ్ర నుండి తమిళనాడుకు అక్రమంగా ఇసుక రవాణా చేసుకుంటున్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించేందుకు వెంకటేశ్వర్లు నాయుడు వీడియో తీస్తున్నాడనే నేపంతో శేఖర్ నాయుడు ప్రోద్బలంతో అప్పయ్య పాల్యానికి చెందిన అశోక్, బాలాజీ, తమిళనాడుకు చెందిన అమర్ అని ఇసుక మాఫియా గ్యాంగ్ బుధవారం రాత్రి వెంకటేశ్వర్లు నాయుడు పై మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరరిచింది. బంధువులు అడ్డుకొని హుటాహుటిన వెంకటేశ్వర్లు నాయుడు ను సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సచేసి ప్రత్యేకత చికిత్స కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో బాధితుడు వెంకటేష్ బంధువులు శ్రీ సిటీ పోలీస్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలుస్తోంది



దాడిలో గాయపడ్డ వెంకటేశ్వర్లునాయుడు



జగన్ రెడ్డి నోటి తీరు మారాలి: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి నోటి తీరు మారాలని టిడిపి బీసి విభాగం నాయకులు హితవు పలికారు. రాప్తాడు పర్యటనలో విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఎస్పీని, ఓ బీసి ఎస్ఐని బట్టలూడదీస్తానని వ్యాఖ్యలు చేయడం జగన్ స్థాయి వ్యక్తికి సరికాదన్నారు. ఒంటి మీద ఖాకీ చొక్కా పడాలంటే ఎంత కష్టపడాలో జగన్ తెలుసుకోవాలని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు సూచించారు. బీసీల జోలికొస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. మిన్నల్ రవి, బుజ్జి, మునిరాజా యాదవ్, కోట చంద్రశేఖర్, సునీల్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

గ్యాస్ ధరలు తగ్గించాలి: సిపిఎం

ప్రజాశక్తి-పలమనేరు : పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ పలమనేరు పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో టమేటా మార్కెట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా మాట్లాడుతూ గ్యాస్ ధర 50 రూపాయలు పెంచినందుకు వారు తీవ్రంగా ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం పెంచుకుంటూ పోతుంటే సామాన్య ప్రజల జీవన వ్యయానికి మరో ఎదురు దెబ్బ తగిలిందన్నారు. గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.50 మేర పెంచిందని, ఈ పెరిగిన ధరలు మంగళవారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని, ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సామాన్య వినియోగదారులపై , రాష్ట్ర ప్రభుత్వంపై కలిపి ప్రతినెలా భారీ ఆర్థిక భారాన్ని మోపనుందన్నారు. ఆంధ్ర రాష్ట్రం లో గ్యాస్ వినియోగం గణ నీయంగా వుందని అంచనాల ప్రకారం.. రాష్ట్రంలోని వినియోగదారులు ప్రతి నెలా దాదాపు కోటి వరకు వంటగ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ధరల పెరుగుదల నేరు గా వారిపై నెలకు అదనంగా రూ.50 కోట్ల భారాన్ని మోపనుందని, ఇది ఇప్పటికే అధిక ధరలతో సతమత మవుతున్న సామాన్య ప్రజలకు మరింత భారంగా మారనుందన్నారు. మరోవైపు.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉజ్వల పథకం ఈ ధరల పెరుగుదల కారణంగా అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కోనుందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో దాదాపు 32.90 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కేవలం రూ. 500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తోంది. కేంద్రం ధరలు పెంచినప్పటికీ.. ఈ లబ్ధిదారులకు అదే ధరకు సిలిండర్‌ను సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, దీని ప్రకారం, పెరిగిన ఒక్కో సిలిండర్‌పై రూ.50 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుంది. ఈ చర్యతో ఉజ్వల పథకం లబ్ధిదారులపై ప్రస్తుత ధరల పెరుగుదల ప్రభావం ఉండదన్నారు. అయితే.. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా అదనంగా రూ. 21.45 కోట్లను భరించాల్సి ఉంటుందన్నారు. ఇతర వినియోగదారుల పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఉజ్వల పథకం పరిధిలోకి రాని దాదాపు 33.82 లక్షల మంది విని యోగదారులు ఈ ధరల పెరుగుదల కారణంగా తీవ్రంగా నష్టపోనున్నారు. వీరికి ఎలాంటి రాయితీ లేనందున.. వారు కొను గోలు చేసే ప్రతి సిలిండర్‌పై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఇది వారి నెలవారీ ఖర్చులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ రాజా, జయంతి, శ్రీరామయ్య, సభ్యులు సుధాకర్, ప్రతాప్, ధనమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.



ఘనంగా ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రకాశం భవనం ఎదుట ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున ఆధ్వర్యంలో ఆ సంఘం 55 వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం గనంగా నిర్వహించారు. ఆ సంఘం జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు, ఓబీసీ నేషనల్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, చంద్రగిరి ఇన్చార్జి లోకేష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖలీల్, శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు మాటా డుతూ ఎన్ఎస్‌యూ ఐ 54 సంవత్సరాలుగా ఎన్నో రాజీ లేని పోరాటలు చేసి విద్యార్థుల కు స్కాలర్ షిప్పులు, ఫీజు రీయింబర్సు మెంటు , మెరుగైన మౌలిక వసతులు సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని కొనియాడారు. రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ మాట్లాడుతూ 1971 ఏప్రిల్ 9వ తేదీన మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘాన్ని స్థాపించారన్నారు. విద్యా రంగంలో సామాజిక న్యాయం కోసం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎస్‌యుఐ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుమార్, జిల్లా కార్యదర్శి కేదార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఎంపీ ధన్యవాదాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తన నిరంతర ప్రయత్నాలతో మరో ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం సాధించారు. తిరుపతి–పాకాల–కాట్పాడి రైలు మార్గాన్ని డబుల్ లైన్‌గా అభివృద్ధి చేయడానికి డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ మొత్తం 104 కిలోమీటర్ల పొడవుతో, దాదాపు రూ.1332 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు రాష్ట్రాల్లోని మూడు జిల్లాల్లో ఈ లైన్ విస్తరించబడి ఉంది. ఈ లైన్ నిర్మాణంతో తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలకి ప్రయాణ సమయం తగ్గి, ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. రవాణా సామర్థ్యం తోపాటుగా వ్యయం కూడా తగ్గుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధిపై గణనీయమైన ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం వద్ద ఆమోదింపజేయడంలో ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఆయన గతంలో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి విన్నవించడం, రైల్వే శాఖకు సంబంధించిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ కు కూడా సమస్యను గుర్చి వివరించారు. ఇండియన్ రైల్వే బోర్డు ఛైర్మన్, సిఈఓలతో సమావేశం కావడం ద్వారా ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఇవన్నీ కలిపి కేంద్రం నుండి ఆమోదం రాకడానికి కీలకంగా నిలిచాయి. ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ లభించిన నేపథ్యంలో ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. ప్రమాదాలు నివారించండి..

ప్రజాశక్తి -రేణిగుంట: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని పోలీసులు సూచించారు. తిరుపతి జిల్లాలో రోడ్ల విస్తరణ కారణంగా వాహనాల వేగం పెరిగిన నేపథ్యంలో, కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు దారితీస్తోందని ఈ తరహా ప్రమాదకర కార్యకలాపాలను అరికట్టేందుకు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో వ్యతిరేక దిశలో వాహనాలు నడిపిన వారిపై మొత్తం 77 కేసులు నమోదు చేశారు. నిందితులను సంబంధిత న్యాయస్థానాలకు హాజరుపరచగా, ఒక్కొక్కరికి రూ. 2500 చొప్పున జరిమానా విధించబడింది.ఈ చర్యలలో భాగంగా 139 వాహనాలను సీజ్ చేయడం కూడా జరిగింది.ప్రమాదాల నివారణకే గాక, ఇతరుల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే మార్గంలో డాలర్స్ కాలనీ, విన్నారీ సర్కిల్, పాత ఈనాడు ఆఫీస్, యోగానంద కాలేజ్ జంక్షన్, గాజులమండ్యం కూడలి, మర్రిగుంట జంక్షన్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఇటువంటి నేరాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ప్రజలు అందరూ నిర్దేశించిన మార్గాల్లోనే వాహనాలు నడిపి, రహదారి భద్రతకు సహకరించాలని తిరుపతి జిల్లా పోలీసు శాఖ కోరుతోందన్నారు. వ్యతిరేక దిశలో ప్రయాణించడం కేవలం చట్టవిరుద్ధం మాత్రమే కాదని, ప్రాణ నష్టం, ఆస్తి నష్టానికి కారణమవుతుందన్నారు.

దోమల నివారణపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం సబ్ యూనిట్ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఫైలేరియా కిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఇచ్చి హైజిన్ ఎలా పాటించాలి, అలాగే డీఈసీ మందులను వేసుకునే పద్ధతిని తెలియజేశారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి రసాయనాలను స్ప్రే చేయించాలని, కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత కారణంగా మూతలేని నీటి నిల్వలతో డెంగీ దోమలు కనిపిస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని లార్వాలు ఉన్న అన్ని ఏరియాలలో స్ప్రేయింగ్ చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో నిర్వహించాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.